
కథ



# దేముడా వీళ్ళను క్షమించవూ

- కె.బి. కృష్ణ

క్రైన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

**మ**నిషికి వున్న పలుకుబడి, అతని కీర్తి ప్రతిష్టలు అతని నిజమైన స్నేహితులు, అతనిని మెచ్చుకునే జనం, అతను మరణించాకే తెలుస్తుంది అంటారు.

గోపాలంగారు ముందురోజు రాత్రి కాలం చేశారు. ఇద్దరబ్బాయిలు, ఒక అమ్మాయి దూర ప్రాంతంలో వుండడం వలన ఆయన భౌతికకాయాన్ని ఒక అద్దాల పెట్టిలో భద్రపరిచారు.

వారి మేడ ముందు షామియానా నిండా జనం. లోపలికి వచ్చేవారు వచ్చి దండవేసి, నమస్కరించి వెళ్ళిపోతున్నారు, మిగిలిన వారంతా విచారంతో నిలబడే వున్నారు.

ఆయన కట్టుకున్న మేడలో, హాలులో వున్న ఆయనకు ఎంతో ఇష్టమైన మెరూన్ కలర్ ముఖమల్ క్లాత్‌తో కుషన్స్‌తో ఏర్పాటు చేసుకున్న ఉయ్యాల బల్ల మీద ఆ అద్దాల పెట్టె పెట్టారు. ఆ పెట్టెలో ప్రశాంతంగా చిరునవ్వులు చిందించే ముఖంతో చూస్తున్నారాయన. ఆయన కళ్ళు తెరిచే వున్నాయి. ఉయ్యాల బల్ల కదలకుండా ఏర్పాటు చేశారు.

మనిషికి ప్రాణంపోయే ముందు బలవంతంగా కళ్ళు తెరుచుకునే వుంటే, ప్రాణం పోకుండా కాపాడుకోవాలని విశ్వప్రయత్నం చేస్తారేమో. అందుకనే కొంత మంది కనులు తెరిచి వుండగానే మరణిస్తారు.

ఆ ప్రక్కనే దివాన్ మీద కూర్చుని వారి భార్య శారద కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

"శారదా ఈ ఉయ్యాలబల్ల మీద తలగడ వేసుకుని పడుకొని, పేపరు చదువుకుంటూ, వార పత్రికలు చదువుకుంటూ టీవీ చూస్తూ, అది నెమ్మదిగా ఊగుతుంటే చిన్న కునుకు తీయాలని వుండేదే నాకు. ఆ ఆశ ఇన్నాళ్ళకు తీరిందే" అని ఆయన పదవీ విరమణ చేసేక, ఇల్లు కట్టుకున్నాక, హాలులో మొదటిసారి ఉయ్యాల బల్లపై కూర్చున్నాక ఆయన ముఖంలో మెరిసిన దరహాసం, తన కోరిక తీరిన క్షణాన్ని, ఆనందకిరణాలతో మెరిసిన ఆయన ముఖం, ఆమె కళ్ళు ముందు మెదులుతూంది.

"ఉయ్యాలబల్ల, ఉయ్యాలబల్ల అని కలవరించారు, ఇందుకేనా" అంటూ మళ్ళీ ఒక్కసారి గొల్లుమంది శారద. చుట్టూ వున్న ఆడవాళ్ళు ఆమెను వోదార్చేరు.

ఇంతలో ఇంటి ముందు కార్లు ఆగేయి.

ఇద్దరబ్బాయిలు, కోడళ్ళు, కూతురు, అల్లుడూ, మనమలు మనమరాళ్ళు బిలబిలా వచ్చేరు.

"మా దగ్గర వుండండి, ఇక్కడ ఒక్కరూ ఏం వుంటారు అంటే విన్నారు కాదు. చివరకు మాకు ఆఖరి చూపు కూడా అందలేదు" అంటూ విలపిస్తున్నాడు పెద్ద కొడుకు. నార్త్ ఇండియాలో ఇంజనీర్‌గా

పనిచేస్తున్నాడతను.

"మీకు ఎవరి దగ్గర వుండాలని వుంటే అక్కడే వుండండి. మేం ఏమీ అనుకోం అన్నాను. వినలేదు. ఇలాగ మమ్మల్ని కడసారి పలకరింపు కూడా లేకుండా చేసేశారు నాన్నా" అంటూ రోదిస్తున్నాడు రెండో కొడుకు. అతను బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు.

"మా వారికి ఎవరూ దిక్కులేదు. రిటైరయ్యాక ఇద్దరూ వచ్చి మా దగ్గర వుండిపోండి అని వచ్చినప్పుడల్లా మొత్తుకునేదాన్ని. నా మాటలు వినలేదు. చివరిసారిగా మీ మాటలు వినకుండా చేసేశారా నాన్నా-" అంటూ అమ్మాయి మరీ ఎక్కువగా ఏడుస్తుంది. ఆమెకు తండ్రి అంటే అపరిమితమైన ప్రేమ.

ఇంతలో, అక్కడే వున్న బంధువుల్లో ఒకరు "బాబూ పోయినోళ్ళని తిరిగి తీసుకురాలేము. జరగాల్సిన కార్యక్రమాలు చూడండి" అన్నారు.

ఈ మాటలు వినగానే గోపాలంగారి భౌతికకాయం చుట్టూ వున్న వారంతా గొల్లుమన్నారు.

ఇద్దరు కొడుకులు, కోడళ్ళు ఒకరి నొకరు ఏవో సైగలు చేసుకుని లోపలకు వెళ్ళిపోయారు. కూతురు తన భర్తతో తల్లిదగ్గరే వుండిపోయింది. మనుమలు, మనుమరాళ్ళు షామియానాలో కుర్చీల్లో కూర్చుని వున్నారు బిక్కముఖాలేసుకుని.

హాలుకు ఆనుకొని వున్న గెస్ట్‌రూమ్‌లో కోడళ్ళు ఇద్దరూ చెరోసోఫాలో కూర్చున్నారు. వాళ్ళవెనుకనే భర్తలు విచార వదనాలతో నిలబడివున్నారు.

పెద్దకోడలు భర్తను కదిలించి ఏవో సైగలు చేస్తూంది. పెద్దబ్బాయి గొంతు సవరించుకుని -

"తమ్ముడూ ఇలాటి విషయాలు మాట్లాడుకోడానికి బాధగా వుంటుందనుకో. అయినా వున్నవి వున్నట్లుగా మాట్లాడుకోవడం మంచిది--" అని మెదలుపెట్టాడు.

అతని మాటలకు అడ్డువస్తూ అతని భార్య "మీరు ఊరుకోండి మీరు చెప్పలేరులేగాని, నేను చెప్తాను. అదిగాదు మరిదిగారూ నేను చెప్పేదేమిటంటే, ఇప్పుడు జరగాల్సిన కార్య క్రమాలు ఏమిటి, ఏ కార్యక్రమానికి ఎవరు ఖర్చు భరించాలి? అన్నది మనం క్లియర్‌గా మాట్లాడుకుంటే మంచిది ---"

వదిన మాటలకు అడ్డు వచ్చి, చిన్నబ్బాయి -

"వదినా అవన్నీ మాట్లాడుకోవడం ఈ సమయంలో అవసరమంటావా? తలా కాస్త వేసుకుని ఎలాగో చేసేస్తాం. నాన్నగారి దగ్గర అంత డబ్బు లేకపోదు--" అన్నాడు.

"తప్పు మరిదిగారూ, ఇప్పుడు మనం అత్తగార్ని కదిలించకూడదు. నేను ఒక లాగా చెప్తాను. అలాగ చేసేద్దాం. ఎవరికీ భారం కాకుండా. ఎందుకంటే మాకు ఇద్దరమ్మాయిలు, మీకు ఒక అమ్మాయి, అబ్బాయి. వాళ్ళ చదువులు శుభకార్యాలు - బోల్డు ఖర్చులు వున్నాయి కదా. తరువాత మనం మీ చెల్లాయిని ఈ విషయంలో తలదూర్చనియ్యకూడదు--".

వదిన మాటలకు చిరాకు ముఖంతో మరిది మళ్ళీ అడ్డువచ్చి "అసలు విషయంలోకి వచ్చేయి వదినా" అన్నాడు. అతని భార్య అతని వీపు గోకుతుంది. మొత్తం ఖర్చంతా తనే భరించేస్తానంటాడో ఏమోననే భయంతో.

"అదే విషయంలోకి వస్తున్నా - ఈరోజు అంత్యక్రియలు దినవారాలు మేము చేసేస్తాం. మీరు అస్సలు కలగచేసుకోకండి. ఆ తరువాత సంవత్సరం పొడుగునా ఆబ్దీకాలు, సంవత్సరీకాలు, అవన్నీ మీరు చేయాలి. మాకు ఇద్దరూ అమ్మాయిలే కాబట్టి కొంచం తక్కువ ఖర్చు ఎన్నుకున్నాం. ఇకపోతే అత్తగారు-"

మళ్ళీ ఆమె మాటలకు అడ్డువచ్చి, చిన్నకొడుకు కోపంతో "చాలు వదినా - అమ్మ ఎక్కడికి వెళ్తుంది? ఇక్కడే వుంటుంది. అమ్మ ఎవరి దగ్గరకూ రమ్మన్నారాదు" అన్నాడు.

"అదికాదు మరిదిగారూ, అత్తగారిని సంవత్సరంలో నాలుగేసి నెలలు తలా ఒకరి ఇంట్లో వుండమని అడుగుదాం. అంటే మీ చెల్లి ఇంట్లో కూడా నాలుగునెలలు వుంటారు. ఒకవేళ ఈ ప్రతిపాదన ఆమెకు నచ్చకపోతే, ఆమెకు సహాయంగా ఒక ఆడమనిషిని పెడదాం. ఆ మనిషి జీతం, ఖర్చు మీరూ అన్నయ్య చెరిసగం భరించాలి. ఇది నా ప్రణాళిక" అంది పెద్ద కోడలు.

గెస్ట్‌రూమ్ కిటికీకి ఆనుకుని వున్న దివాన్ మీద దుఃఖంలో మునిగి కూర్చుని వున్న శారదకు కొడుకు కోడళ్ళ కబుర్లు వినిపిస్తున్నాయి.

భర్త పోయిన దుఃఖం ఆమెకు, తన జీవితంలో తీవ్రమైన వాయుగుండంలా బాధిస్తుంటే, వీళ్ళ మాటలు, ఆలోచనలు, ఆ వాయుగుండం తీరం దాటేటప్పుడు సముద్రం అతలా కుతలం అయినంత ఆవేదన కలగజేస్తుంది.

రెండు రోజుల క్రితం గుండెలు చేత్తో పట్టుకుని బాధతో సతమతమవుతుంటే "పిల్లల్ని పిలిపించనా" అంటే "వాళ్ళు వచ్చి ఏం చేస్తారు. నా ప్రాణాన్ని నిలుపుతారంటావా. పిచ్చిదానా. నువ్వు వుంటే చాలే నాదగ్గర. అయినా అన

# ఆమని

మానవులనే కాదు
మహియందు....
పశు పక్ష్యాదుల సైతం
పరవశింపజేసే శక్తి ఒక్క
ప్రకృతికే సొంతం !
ఆమని
అందాల్ని ఆస్వాదించడం
అరుదైన అనుభవం !
వేన వేల శాంతి కపోతాలు
వినీలాకాశంలో...
విహరిస్తున్నట్లుగ....
చిగురుటాకు
చోటును కూడా దాచి...
ముచ్చట గొలుపుతూ
మనసును దోచే....
పూలసోయగాలను చూసి
పులకరించడం మన
పూర్వజన్మ సుకృతం !

- దాస్యం సేనాధిపతి

వసరంగా బోల్డు డబ్బు ఖర్చు చేసుకొని వస్తారు" అనేశారాయన. కాని వీళ్ళు అదే డబ్బు ఖర్చయిపోతుందని బాధపడిపోతున్నారు. దేవుడా వీళ్ళని క్షమించు అనుకుంది.

"ఏమే లోపల జరుగుతున్న చర్చలు వింటున్నావా. నువ్వు కూడా వెళ్ళు లోపలికి' అన్నట్లుగా కూతురి వైపు చూసి, మరల గెస్ట్ రూమ్ వైపు చూసింది.

వెంటనే అమ్మాయి లేచి లోపలికి వెళ్ళింది. "అన్నయ్యా ఇప్పుడేమిటి ఈ చర్చలు. జరగవలసిన కార్యక్రమాలు త్వరగా జరిగేట్లు చూడండి. మన వీధిలో అందరూ తలా ఒక మాట అంటున్నారట" అంది వెళ్ళగానే బాధ, కోపం మిళితమైన స్వరంతో.

ఇంతలో, ఎవరో బంధువులు వచ్చి అందరిని బయటకు రమ్మన్నారు.

గోపాలంగారికి బాగా కావాల్సిన బంధువులు కావడంతో, కుటుంబంలో అందర్నీ పేరుపేరునా పరామర్శించడానికి వచ్చారు వాళ్ళు.

పరామర్శలు, ఊరడింపులు, గత స్మృతులు నెమరువేసుకోడాలు, గోపాలంగారి చేష్టలు, ఆయన బంధువుల పట్ల ప్రదర్శించిన ప్రేమాభిమానాలు, ఆయన కొందరిని ఆదరించిన తీరు, ఆయన మంచితనం, అవన్నీ గుర్తు చేసుకుంటున్నారందరూ.

మనిషి చనిపోయేక, కూడా తీసుకుని వెళ్ళేది ఏదీ లేదు. తను చేసిన మంచి పనులు, తను ఎదుటివారి పట్ల కనపరిచిన దయ, దాక్షిణ్యం, ప్రేమానురాగాలు, చేసిన దాన ధర్మాలు ఇవన్నీ కూడా వెళ్తాయి. సజీవంగా మనుషుల మనసుల్లో వుండిపోతాయి. చివరికి నడుముకు వున్న మొలతాడు కూడా మట్టిలో కలవక పోవడం శోచనీయం.

కాని--

ప్రాణం పోయేవరకూ, నాది, నేను, నా వాళ్ళు, అమ్మో నేను ఇది ఇవ్వను దీన్ని నేను వదిలి వుండలేను, అని పిచ్చిపిచ్చిగా ఆరాటపడుతుంటాడు మనిషి.

కొడుకులిద్దర్నీ దగ్గరకు రమ్మని సైగ చేసింది శారద. ఆమె దగ్గరగా కూర్చున్నారు ఇద్దరూ.

"బాబూ - ఇవిగో ఈ బ్యాంక్ పాస్ బుక్స్ చూడండి. మీ నాన్నగారు రెండు ఖాతాలు తెరిచారు. నేను గాని, ఆయన గాని ముందుగా ఎవరు చనిపోయినా, వాళ్ళకు అంత్యక్రియల దగ్గర నుండి సంవత్సరీకాలు, ప్రతి సంవత్సరం ఆబ్దీకాల ఖర్చుల నిమిత్తం, ఒక బ్యాంకు ఖాతాలోని డబ్బు సరిపోతుంది.

ఇక రెండవ ఖాతాలోని డబ్బు మా ఇద్దరిలో ఎవరు మిగిలితే వారికి ఖర్చుల నిమిత్తం "ఆశ్రమ శ్రావణి" వృద్ధాశ్రమంలో రెండు లక్షలు ఖర్చుపెట్టి అన్ని సౌకర్యాలకు ఒక గది కట్టించారు. మా ఇద్దరిలో ఎవరు మిగిలితే వాళ్ళు జీవితాంతం ఆ గదిలో ఏ లోటూ లేకుండా వుండడానికి.

తరాల అంతరం వలన అభిప్రాయ భేదాలు వచ్చి ఒకరి నొకరు అర్థం చేసుకోవడం కష్టం అవుతుంది. అందుకని మనసులు దెబ్బతినకుండా చివరి వరకూ మాకు కావాల్సిన రీతిలో వుండాలని ఈ నిర్ణయం తీసుకున్నాం --" అంటున్న ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండి పోయాయి. ఆమె కళ్ళు తుడుచుకుని, అద్దాల పెట్టెవైపు చూసి

"బాబూ ఆ మహారాజు అంతిమ యాత్రకు అయ్యే ఖర్చు కోసంగాని, నా కోసం గాని మీరు పైసా ఖర్చుపెట్టాల్సిన పనిలేదు. మీ నాన్నగారు దాచిన డబ్బుతో ఆయన అంతిమ సంస్కారాలన్నీ, మనస్ఫూర్తిగా ఆయన అంతస్థుకు, వ్యక్తిత్వానికి ఏమాత్రం తగ్గకుండా నెరవేర్చండి బాబూ--" అంటూ ఒక బ్యాంకు బుక్ అబ్బాయికి ఇచ్చింది.

ఆమె ముఖాన్ని కొడుకులు, కోడళ్ళు చూడలేకపోతున్నారు. వాళ్ళ తలలు భూదేవిని చూస్తున్నాయి తమ ఆలోచనలకు సిగ్గు పడుతూ. భూమాత ఎంతో మందిని క్షమిస్తుంది కదా.

అయినా- పెద్దకోడలు, చిన్నకోడలు చెవిలో "మరి ఇద్దరూ ఒకేసారి చనిపోతే కార్యక్రమాలకు ఏం కేటాయించారో" అంటూంది.

పెద్దవాళ్ళందరూ అద్దాల పెట్టె దగ్గరకు చేరుతున్నారు.

శారద వెంటనే లేచింది. తన భర్తను ఒక్కసారి తనివితీరా చూసుకోవాలని.

ఆయన తన కళ్ళల్లోకి చూస్తున్నారు.

"శారదా నేను చనిపోయేక అంత్యక్రియలు, దినకర్మలు వగైరాలు ఎలా చేయాలి, ఎవరు చేయాలి లాంటి అనేకమైన ప్రశ్నలు ఉత్పన్నమౌతాయి. బాధపడకు. నిన్ను మన అమ్మాయి తనతో తీసుకువెళ్తానంటుందనుకో. ఏది ఏమైనా ఇలాంటి విషాదకరమైన పరిణామాలు సంభవించకుండా నేను అన్ని ఏర్పాట్లు చేశాను. ఇవిగో బ్యాంక్ అక్కౌంట్ బుక్స్" అని ఆయన తడి అయిన కళ్ళతో నెల క్రితం చెప్పిన దృశ్యం కనులలో కదలాడింది. అవును మహారాజు తన ఏర్పాట్లు తానే చేసేసుకుని వెళ్ళిపోయారు". ఏడుస్తూ ఆయన పాదాలను తాకుతున్న ఆమెను లోపలకు తీసుకువెళ్ళిపోయారు అక్కడ వున్న స్త్రీలందరూ.

షామియానా మైకులోంచి ఘంటసాల గానం చేసిన భగవద్గీత వినిపిస్తోంది.

"జాతస్యహి ధృవో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ

తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి

పుట్టినవానికి మరణము తప్పదు. మరణించిన వానికి పునర్జన్మ తప్పదు. కనుక తప్పనిసరియైన ఈ విషయమై శోకించుట యుక్తము కాదు"

అయితే - గతించిన మనిషి మళ్ళీ పుట్టడం,మనిషి చూడలేదు, చూడలేదు కూడా. అందువలన అవివేకి లాగా శోకించడం తప్ప ఏమీ చేయలేదు పాపం.


## ఫిలింగైడ్ ఫ్రీ

కేవలం రూ. 25/-లు ఈ క్రింది అడ్రసుకు యం.ఓ. చేయండి. వెంటనే 2 జోకుల పుస్తకాలు, 1 కవితల పుస్తకంతో 2006 ఫిలిం గైడ్ (సినీ తారల, దర్శకులు వగైరా అడ్రసులున్నది) పంపించబడును.

**వై.కె.మూర్తి**
దాసరివారి వీధి, సూర్యారావు పేట,
విజయవాడ-520 002.